సాక్షి
వికారాబాద్
ఆదివారం । 9 । ఫిబ్రవరి । 2025



వరుసగా చోరీలు

రాత్రి, పగలు తేడా లేకుండా చోరీలకు పాల్పడుతున్న దొంగలు పోలీసులకు సవాలు విసురుతున్నారు. 8లో▸



గ్యాస్ లీకై నలుగురికి..

ప్రమాదవశాత్తు గ్యాస్ సిలిండర్ పైప్ లీక్ కావడంతో మంటలు వ్యాపించి నలుగురు గాయపడ్డారు. 8లో▸



'స్థానిక' కోలాహలం

రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించేందుకు కసరత్తు ప్రారంభించింది. 9లో▸

న్యూస్‌రీల్

నేడు జినుగుర్తికి స్పీకర్ ప్రసాద్‌కుమార్ రాక

తాండూరు రూరల్: తాండూరు మండలం జినుగుర్తి గ్రామ సమీపంలోని ఏకలవ్య గ్రామీణ వికాస్ ఫౌండేషన్‌లో ఆదివారం జరిగే కార్యక్రమానికి స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ హాజరుకానున్నట్లు ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ పీవీ రావు, ప్రొఫెసర్ మల్లారెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సాందీపని గురుకుల పాఠశాల, పాలిటెక్నిక్ కళాశాల వార్షికోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి, రిటైర్డ్ చీఫ్ ప్రిన్సిపల్ సెక్రెటరీ ఉమామహేశ్వర్‌రావు, నిమ్స్ ఆస్పత్రి డైరక్టర్ బీరప్ప, ఐఐటీ హైదరాబాద్ డైరక్టర్ శ్రీనివాస్‌మూర్తి, ఆర్‌ఎస్‌ఎస్ అఖిల భారత కార్యకారిణీ భాగయ్య హాజరవుతారని తెలిపారు.

రేపు మల్లికార్జునస్వామి కల్యాణోత్సవం

తాండూరు రూరల్: మండలంలోని బిజ్వార్(బొంకూర్)గ్రామంలో సోమవారం భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి కల్యాణోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త కుర్వ కిష్టయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయ 29 వార్షికోత్సవంలో భాగంగా ఆదివారం స్వామివారికి గంగస్నానం, పుణ్యవచనం, నవగ్రహపూజ, మహారుద్రాభిషేకం నిర్వహించనున్నారు. సోమవారం ఉదయం కల్యాణోత్సవం, ఆ తర్వాత బోనాల ఊరేగింపు ఉంటుందన్నారు.

అక్రమ నిర్మాణాలకు అనుమతులివ్వొద్దు

డీఎల్‌పీవో శంకర్ నాయక్



పంచాయతీ కార్యదర్శులతో మాట్లాడుతున్న శంకర్ నాయక్

దుద్యాల్: పంచాయతీ కార్యదర్శులు ప్రజలకు అందుబాటులో ఉండాలని డీఎల్‌పీవో శంకర్ నాయక్ సూచించారు. శనివారం దుద్యాల్ ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారికి పలు సూచనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో అక్రమ నిర్మాణాలకు ఎట్టి పరిస్థితుల్లో కూడా అనుమతులు ఇవ్వరాదని ఆదేశించారు. జనన, మరణ ధ్రువ పత్రాల జారీలో నిర్లక్ష్యం చేయరాదని అన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో మహేశ్, సూపరింటెండెంట్ శ్రీనివాసులు, పంచాయతీ కార్యదర్శులు సత్యనారాయణ, రాధ, మోహన్, రమేశ్, అరుణజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

మహిళా సంఘాల బలోపేతానికి కృషి

కలెక్టర్ ప్రతీక్‌జైన్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

అనంతగిరి: మహిళా స్వయం సహాయక సంఘాలను బలోపేతం చేసేందుకు సీఆర్‌పీ వ్యూహం అనే కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్ ప్రతీక్‌జైన్ తెలిపారు. శనివారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో సీఆర్‌సీ మహిళలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళా సంఘంలోని ఒక్కో గ్రూపులో ముగ్గురు చొప్పున 15 బృందాలు, 45 మంది మహిళలు ఉంటారని తెలిపారు. ధారూరు, దోమ, వికారాబాద్, మర్పల్లి, మోమిన్‌పేట మండలాల్లో సంఘాలను ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. సంఘం సభ్యులకు 8 రోజుల పాటు అవగాహన, శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తారని తెలిపారు. సమావేశంలో డీఆర్డీఓ శ్రీనివాస్, అడిషనల్ డీఆర్‌డీపీ సరోజ తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ పోటీల్లో రాణించాలి



నవనీత దంపతులను సన్మానిస్తున్న డాక్టర్ సంపత్‌కుమార్

తాండూరు: అంతర్జాతీయ మాస్టర్ అథ్లెటిక్స్ పోటీల్లో నవనీత రాణించాలని బీవీజీ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ సంపత్‌కుమార్ అన్నారు. నవనీతను ప్రోత్సహించిన భర్త మహేష్‌ను శనివారం సన్మానించి మెమోంటో అందజేశారు. ఈ సందర్భంగా సంపత్‌కుమార్ మాట్లాడుతూ.. జాతీయస్థాయి హై జంప్ పోటీల్లో బంగారు పతకం సాధించిన క్రీడాకారిణి అంతర్జాతీయ పోటీల్లో రాణించాలని ఆకాంక్షించారు.

పరీక్షల వేళ.. ఫీజుల గోల!

ఇదే అదనుగా భావించి ఒత్తిడి చేస్తున్న యాజమాన్యాలు

- చెల్లించని విద్యార్థులను క్లాస్ బయట నిలబెడుతున్న వైనం
- మానసికంగా కుంగిపోతున్న చిన్నారులు
- చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న విద్యాశాఖ
- జిల్లాలో 190 ప్రైవేటు పాఠశాలలు, 48వేల మంది విద్యార్థులు



వికారాబాద్: వార్షిక పరీక్షలకు సమయం దగ్గర పడుతుండటంతో ప్రైవేటు స్కూళ్ల యాజమాన్యం విద్యార్థుల ముక్కుపిండి ఫీజులు వసూలు చేస్తున్నాయి. లేదంటే పరీక్షలు రాయనివ్వమని బెదిరిస్తున్నారు. అంతేకాకుండా ఫీజు కట్టని విద్యార్థులను తరగతి బయట నిలబెడుతున్నారు. దీంతో చిన్నారులు మానసికంగా కుంగిపోతున్నారు. తోటి విద్యార్థుల ముందు అవమాన భారం మోస్తున్నారు. అయినా విద్యాశాఖ అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ ఫీజు చార్టును పక్కన పెట్టి ఎవరికి తోచిన రీతిలో వారు వసూలు చేస్తున్నారు. స్లిప్ టెస్టులు మొదలుకొని సమ్మెటీవ్, ఫార్మెటీవ్ వరకు ఏ పరీక్షలు నిర్వహించినా ఫీజుల కోసం విద్యార్థులను వేదిస్తున్నారు. ఫీజు చెల్లిస్తేనే పరీక్ష రాయిస్తామని కండీషన్ పెడుతున్నారు. లేదంటే ప్రిన్సిపాల్ వద్దకు వెళ్లాలని ఆదేశిస్తున్నారు. మరి కొన్ని పాఠశాలల్లో ఫీజు కట్టకుంటే స్కూల్‌కు రావద్దని హుకూం జారీ చేస్తున్నారు. పరీక్షల సమయంలో ఇలా వేదించడం ఏమిటని పిల్లల తల్లిదండ్రులు ప్రశ్నిస్తే ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఫీజుల నిబంధనలు పాటించాలని విద్యాశాఖ అధికారులు పదేపదే చెబుతున్నా క్షేత్రస్థాయిలో మాత్రం అమలు కావడం లేదు. జిల్లాలో అధికారికంగా 190 ప్రైవేటు పాఠశాలలు ఉండగా ఇందులో 48,000 మంది పైచిలుకు విద్యార్థులు చదువుతున్నారు.

విద్యాశాఖ ఫీజు చార్టు ఇలా..

చివరగా 2018–19 విద్యా సంవత్సరానికి ప్రభుత్వం ఫీజుల చార్టు విడుదల చేసింది. అయితే యాజమాన్యాలు ఇవేవీ పాటించడంలేదు. విద్యాశాఖ ఫీజు చార్ట్ ప్రకారం ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాల స్థాయిలో గ్రామీణ ప్రాంతాల్లో అయితే నెలకు రూ 650, సంవత్సరానికి 7,800 వసూలు చేయాలి. పట్టణ ప్రాంతాల్లో అయితే నెలకు రూ.750, ఏడాదికి రూ. 9,000 తీసుకోవాలి. ఉన్నత పాఠశాల స్థాయిలో గ్రామీణ ప్రాంతాల్లో నెలకు రూ.900, ఏడాదికి రూ.10,800, పట్టణ ప్రాంతాల్లో అయితే నెలకు రూ.1,000, ఏడాదికి రూ.12,000 తీసుకోవాలనే నిబంధనలు ఉన్నాయి. అయితే పాఠశాలలు కల్పించే సౌకర్యాలను బట్టి 10 శాతం అధికంగా తీసుకోవచ్చని పేర్కొన్నారు. ఈ విషయమై డీఈఓ రేణుకాదేవిని వివరణ కోరగా ప్రైవేటు పాఠశాలల్లో ఫీజుల కోసం విద్యార్థులను ఇబ్బందులు పెడుతున్నట్లు ఎవరైనా తల్లిదండ్రులు ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఫీజుల నియంత్రణలో విఫలం

ప్రైవేటు పాఠశాలల్లో సౌకర్యాలు లేకపోయినా భారీగా ఫీజులు వసూలు చేస్తున్నారు. ఎల్‌కేజీ పిల్లలకే ఏడాదికి రూ.40 వేలకు పైగా వసూలు చేస్తున్నారు. ఒకటి నుంచి పదో తరగతి వరకు రూ.30 వేల నుంచి రూ.లక్ష వరకు తీసుకుంటున్నారు. ఎస్ వన్, ఎస్ టూ, ఎఫ్ వన్, ఎఫ్ టూ, ఎఫ్ త్రీ, ఎఫ్ ఫోర్ తదితర పరీక్షలు ఫీజుల కోసమే నిర్వహిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇక పుస్తకాలు, యూనిఫాంలకు అదనంగా వసూలు చేస్తున్నారు.

క్లీన్ మున్సిపాలిటీకి చర్యలు

- ప్రతి గల్లీకి అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ఉండేలా డీపీఆర్ సిద్ధం
- తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరు: ప్రతి వార్డులో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మించి తాండూరును క్లీన్ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి అన్నారు. శనివారం హైదరాబాద్‌లోని తన కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ విక్రంసింహారెడ్డి, డీఈఈ, ఏఈ, మున్సిపల్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. చిలుక వాగును అనుసంధానం చేస్తు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మించేలా సర్వే చేపట్టాలని అధికారులకు సూచించారు. ఇప్పటికే తయారు చేసిన డీపీఆర్‌లో కొంత మార్పులు చేయాలన్నారు. మురుగునీటి శుద్ధి ప్లాంట్ ఏర్పాటుకు అనువైన స్థలం గుర్తించాలని ఆదేశించారు. పట్టణంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులకు నిధులు మంజూరు చేసేందుకు సీఎం రేవంత్‌రెడ్డి సానుకూలంగా ఉన్నారని తెలిపారు. రూ.500 కోట్లతో 260 కిలో మీటర్ల మేర చేపట్టే భారీ ప్రాజెక్ట్‌లో ఎలాంటి పొరపాట్లకు ఆస్కారం లేకుండా చూడాలన్నారు. ఈ పనులు పూర్తయితే తాండూరు రూపు రేఖలు మారుతాయని పేర్కొన్నారు. మున్సిపల్ కార్యాలయానికి వచ్చే ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఎమ్మెల్యే సూచించారు.



అండర్ గ్రౌండ్ డ్రైనేజీ మ్యాప్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

ఒక్కరోజే 268 మంది మందుబాబులు చిక్కారు

సాక్షి, సిటీబ్యూరో: సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు మందుబాబుల మత్తు వదిలిస్తున్నారు. ఈ నెల 7న నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ (డీడీ) తనిఖీల్లో 268 మంది పట్టుబడ్డారు. వీరిలో 223 మంది ద్విచక్ర వాహనదారులు కాగా.. 10 మంది త్రీ వీలర్స్, 33 మంది ఫోర్ వీలర్స్, ఇద్దరు ట్రక్ డ్రైవర్లు ఉన్నారు. ఆయా వాహనాలను పోలీసులు సీజ్ చేశారు. పోలీసులకు చిక్కిన వారిలో 35 మంది మత్తు బాబుల బీఏసీ మోతాదు 200 ఎంజీ/100 ఎంఎల్ నుంచి 550 ఎంజీ/100 ఎంఎల్‌గా నమోదయింది. మద్యం మత్తులో వాహనాలను నడిపే వారిపై భారత న్యాయ సంహిత (బీఎన్ఎస్) సెక్షన్ 105 కింద కేసులు నమోదు చేశారు.



అంతారంలో మొల్ల విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న సంఘం నేతలు

మొల్ల జీవితం ఆదర్శనీయం

- కుమ్మర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జయంత్‌రావు
- అంతారంలో విగ్రహావిష్కరణ

తాండూరు రూరల్: తొలి తెలుగు కవయిత్రి మొల్ల జీవితం అందరికీ ఆదర్శనీయమని కుమ్మర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నడికుడ జయంత్‌రావు అన్నారు. శనివారం తాండూరు మండలం అంతారం గ్రామం రైతు వేదిక వద్ద తాండూరు కుమ్మర సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కవయిత్రి మొల్ల విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సరళమైన పదాలతో అందరికీ అర్థమయ్యేలా మొల్ల రామాయణం రాశారన్నారు. ఆమెను ఆదర్శంగా తీసుకొని బాలికలు, మహిళలు చదువులో రాణించాలని కోరారు. మార్చి 13ను మొల్ల జయంతిని ప్రభుత్వం అధికారికంగా జరపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు దయానంద్, భిక్షపతి, రాజలింగం, లక్ష్మీనారాయణ, శ్రీనివాస్, వీరయ్య, పాండు, అనంతయ్య, మారుతి, నారాయణ, మహేందర్, విశ్వనాథ్, రాజ్‌కుమార్, వడ్డె శ్రీను, రాములు, శాంతు, వెంకట్, బందెప్ప, గణేశ్, అనంత్, జనార్దన్, మంబాపూర్ వెంకట్, శ్రీశైలం, రవి, సాయి పాల్గొన్నారు.

ఫార్మాసిటీకి భూములివ్వం



ధర్నా చేస్తున్న బాధిత రైతులు

- తేల్చి చెప్పిన రైతులు
- రంగారెడ్డి కలెక్టరేట్ ఎదుట ఆందోళన

ఇబ్రహీంపట్నం రూరల్: ఫార్మాసిటీ ఏర్పాటుకు తమ భూములు ఎట్టి పరిస్థితుల్లోనూ ఇవ్వబోమని భూ బాధితులు స్పష్టం చేశారు. శనివారం రైతులు హియరింగ్‌కు హాజరుకావాలని నోటీసులు జారీ చేసి అనివార్య కారాణాలతో వాయిదా వేశారు. దీంతో ఆగ్రహానికి గురైన వారు ఒక్కసారిగా కలెక్టరేట్‌కు తరలివచ్చి ధర్నాకు దిగారు. ఫార్మాకు తమ భూములు ఇచ్చేది లేదని తేల్చి చెప్పారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ.. భయభ్రాంతులకు గురి చేసేలా ప్రభుత్వం వ్యవహరించడం సరి కాదని అన్నారు. బలవంతపు భూసేకరణను సవాల్ చేస్తూ హైకోర్టుకు వెళ్లగా, కోర్టు ఇచ్చిన తీర్పును అమలు చేయకుండా నాలుగేళ్లుగా తాత్సారం చేస్తున్నారని మండిపడ్డారు. భూ రికార్డుల్లో టీజీఐఐసీ పేర్లు తొలగించి రైతుల పేర్లు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని డిమాండ్ చేశారు. నాలుగేళ్లుగా పంటలు పండించకుండా, రుణాలు తీసుకోకుండా, రైతుబంధు, రైతుబీమా పథకాలకు దూరంగా ఉన్నామని ఆవేదన వ్యక్తం చేశారు. హైకోర్టు ఆదేశాలను అధికారులు భేఖాతరు చేయడం సమంజసం కాదన్నారు. రైతులకు నోటీసులు జారీ చేసి పిలవడం సరైంది కాదని మండిపడ్డారు. ఫార్మాసిటీని రద్దు చేసి రైతుల భూములను తిరిగివ్వాలని, లేదంటే పెద్ద ఎత్తున పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. అనంతరం కలెక్టరేట్ ఏఓ సునిల్ నిథాన్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఫార్మా వ్యతిరేక పోరాట సమితి నాయకులు కవుల సరస్వతి, రైతులు వంగూరి కృష్ణ, కానమోని గణేశ్, సత్తమ్మ, దేవల్‌రెడ్డి, స్వాతి తదితరులు పాల్గొన్నారు.

రైతులను ఇబ్బంది పెట్టం

యాచారం: భూసేకరణ విషయంలో రైతులను ఇబ్బంది పెట్టాలనే ఆలోచన సర్కార్‌కు లేదని ఇబ్రహీంపట్నం ఆర్డీఓ అనంత్‌రెడ్డి పేర్కొన్నారు. కలెక్టర్ పేరు మీద నక్కర్తమేడిపల్లి, నానక్‌నగర్, తాడిపర్తి, కుర్మిద్ద గ్రామాల రైతులకు నోటీసులు ఇచ్చి తర్వాత సమావేశం రద్దయినట్లు చెప్పడంపై అనుమానాలు వ్యక్తం మయ్యాయి. ఈ నేపథ్యంలో యాచారం తహసీల్దార్ కార్యాలయంలో అందుబాటులో ఉన్న ఆర్డీఓ అనంత్‌రెడ్డి దగ్గరకు వచ్చి అభ్యంతరాలు తెలియజేయవచ్చని తహసీల్దార్ అయ్యప్ప రైతులకు సమాచారం అందించారు. అయినప్పటికీ వారు తహసీల్దార్ కార్యాలయానికి రాకుండా కలెక్టరేట్‌కు తరలివెళ్లారు. దీంతో ఆర్డీఓతో పాటు ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు, గ్రీన్ ఫార్మాసిటీ, యాచారం సీఐలు కృష్ణంరాజు, నర్సింహారావు సైతం అక్కడికి వెళ్లారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ.. కలెక్టర్ ఆదేశాల మేరకు మరోసారి నోటీసులు జారీ చేసి భూసేకరణపై అభ్యంతరాలు తెలుసుకుంటామని తెలిపారు.

పట్టా భూముల సర్వే పూర్తి



పట్టా భూములకు సర్వే చేసి హద్దులు గుర్తిస్తున్న రెవెన్యూ అధికారులు

- హకీంపేట్‌లో 146.34 ఎకరాలకు హద్దుల గుర్తింపు
- భారీ బందోబస్తు మధ్య ప్రక్రియ పూర్తి

దుద్యాల్: పారిశ్రామికవాడ ఏర్పాటులో భాగంగా శనివారం దుద్యాల్ మండలం హకీంపేట్‌లో పట్టా భూముల సర్వే ప్రక్రియ పూర్తయ్యింది. గ్రామానికి చెందిన 114 మంది పట్టాదారులకు సంబంధించిన 146.34 ఎకరాలకు సర్వే పూర్తి చేసి హద్దులు గుర్తించినట్లు తహసీల్దార్ కిషన్ తెలిపారు. నెల రోజుల క్రితం గ్రామ పరిధిలోని 351 ఎకరాల అసైన్డ్ భూములకు సర్వే పూర్తి చేసిన విషయం తెలిసిందే. పట్టా భూముల సర్వేకు అధికారులు పక్క ప్రణాళికతో ముందుకు సాగారు. పోలీసులను నాలుగు గ్రూపులుగా ఏర్పాటు చేసి ఒక్కో గ్రూపును ఒక వైపు పంపి సర్వేను పూర్తి చేశారు. 18 మంది రైతులు మాత్రమే తమ పొలాల వద్దకు వచ్చి హద్దులు చూపించారు. మిగతా వారు రాకున్నా అధికారులు రికార్డుల ప్రకారం సర్వేను పూర్తి చేశారు. కార్యక్రమంలో ఉప తహసీల్దార్ వీరేశ్‌బాబు, ఆర్ఐ నవీన్, సర్వే సిబ్బంది పాల్గొన్నారు.

ఎక్కడ చూసినా పోలీసులే..

భూ సర్వే నేపథ్యంలో హకీంపేట్‌లో ఎక్కడ చూసినా పోలీసులే కనిపించారు. గ్రామ ప్రధాన కూడళి, వీధులు, పొలాల వద్ద పోలీసు బలగాల దర్శనమిచ్చాయి. గ్రామంలో దాదాపు 200 మంది పోలీసులు మోహరించడంతో ప్రజలు కొంత ఆందోళనకు గురయ్యారు. పరిగి డీఎస్పీ శ్రీనివాస్, కొడంగల్ సీఐ శ్రీధర్‌రెడ్డి, పరిగి సీఐ శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు పహారా కాశారు.



హకీంపేట్ గేట్ వద్ద భారీగా మోహరించిన పోలీసు బలగాలు

పరిహారం తేల్చని ప్రభుత్వం

అసైన్డ్ భూముల తరహాలో కాకుండా పట్టా భూములకు పరిహారం ఇవ్వాలని వాటి యజమానులు డిమాండ్ చేస్తున్నారు. అయితే దీనిపై ప్రభుత్వం ఇప్పటి దాకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. కలెక్టర్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి కమిటీ పరిహారం ఎంత అనేది నిర్ణయించాల్సి ఉంటుంది. గతంలో అసైన్డ్ భూములకు సంబంధించిన పరిహారం తేల్చిన అధికారులు పట్టా భూముల పరిహారంపై మాత్రం గోప్యత పాటిస్తున్నారు. అసైన్డ్ భూములకు ఇచ్చినట్లే పరిహారం ఇస్తారా లేక పెంచుతారా అనేది తేలాల్సి ఉంది. త్వరలో దీనిపై నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని రెవెన్యూ అధికారులు తెలిపారు.

భూములివ్వం

పట్టా భూముల సర్వేకు కొంత మంది రైతులు మాత్రమే సహకరించారు. 114మందికి గాను కేవలం 18మంది రైతులు మాత్రమే అధికారులకు పొలాలు చూపించారు. మిగిలిన వారు భూములు ఇచ్చేందుకు సిద్ధంగా లేనట్లు తెలిసింది. తరతరాల నుంచి సాగు చేసుకుంటున్న భూములను ఇచ్చేది లేదని పలువురు తేల్చి చెప్పారు.

బంగారం అమ్మి భూమి కొన్నా



మా అత్త మామలు మాకు కొంత భూమి ఇచ్చారు. నేను పుస్తెల తాడు అమ్మి మరి కొంత భూమి కొన్నా. ప్రస్తుతం ఏడు ఎకరాలు భూమి ఉంది. అందులో రెండెకరాల మామిడి తోట. నాకు ఇద్దరు కొడుకులు. వారికి పొలం తప్ప ఇతర జీవనాధారం లేదు. ఉన్న భూమినంతా గుంజుకుంటే మేం ఎలా బతకాలి. అధికారులు, ప్రభుత్వం ఆలోచించి నిర్ణయం తీసుకోవాలి.

– దొరమోని అనంతమ్మ, హకీంపేట్

అసైన్డ్ ఇచ్చాం.. పట్టా భూమి ఇవ్వం



నా భార్య పేరిట ఉన్న 2.2 ఎకరాల అసైన్డ్ భూమిని పారిశ్రామికవాడ కోసం ఇచ్చాం. ఇప్పుడు పట్టా భూమి కావాలంటున్నారు. మా అన్నదమ్ములకు చెందిన 11.5 ఎకరాల పట్టా భూమి పోతోంది. నా భూమిలో సర్వేను ఎట్టి పరిస్థితుల్లో అంగీకరించబోం. భూములు ఇవ్వమని చెబుతున్నా ప్రభుత్వం వినడం లేదు. మా భూములు కావాలంటే మమ్మల్ని చంపేయండి.

– రాకం యాదయ్య, అరుణ దంపతులు, హకీంపేట్

కీసరగుట్ట బ్రహ్మోత్సవాలకు పటిష్ట బందోబస్తు

కీసర: కీసరగుట్ట శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయ బ్రహ్మోత్సవాలకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తున్నామని రాచకొండ సీపీ సుధీర్‌బాబు అన్నారు. శనివారం రాచకొండ కమిషనరేట్ కార్యాలయంలో కీసరగుట్ట బ్రహ్మోత్సవాలకు సంబంధించి భద్రతా చర్యలు, భక్తులకు వసతులు, బందోబస్తు ఏర్పాట్లు తదితరాలపై అధికారులతో నిర్వహించిన సమన్వయ సమావేశంలో ఆయన మాట్లాడారు. సుమారు 2 వేల మంది పోలీస్ సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రజాప్రతినిధులు, వీఐపీలతో పాటు సాధారణ భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అన్ని శాఖల అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో డీసీపీలు పద్మజ, అరవింద్ బాబు, నరసింహా రెడ్డి, ఇందిర, రమణా రెడ్డి, మల్లారెడ్డి, శ్యామ్, నాగలక్ష్మి, అదనపు డీసీపీ (అడ్మిన్) శివకుమార్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

బీజేపీ సంబురాలు

అనంతగిరి: దేశ రాజధాని ఢిల్లీ పీఠంపై 27 ఏళ్ల అనంతరం కాషాయ జెండా రెపరెపలాడటంతో శనివారం వికారాబాద్‌లో బీజేపీ నాయకులు సంబరాలు చేసుకున్నారు. ఢిల్లీ ప్రజలు ఆశీర్వదించారని పార్టీ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి అన్నారు. పట్టణంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో టపాసులు పేల్చారు. ఈ సందర్భంగా మాధవరెడ్డి మాట్లాడుతూ.. ఢిల్లీ ఫలితాలు ప్రధాని మోదీపై ప్రజల విశ్వాసానికి నిదర్శనమన్నారు. డబుల్ ఇంజన్ సర్కారుతోనే దేశాభివృద్ధి సాధ్యమన్నారు. ఆప్ పదేళ్ల పాలనలో జరిగిన అవినీతిని, అక్రమాలకు ఢిల్లీ ప్రజలు స్వస్తి పలికారన్నారు. ఈ ప్రభావం యావత్ దేశంపై ఉంటుందన్నారు. భవిష్యత్తులో ఇదేతంతు కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షురాలు యాస్కి శిరీష, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శివరాజు, రాష్ట్ర నాయకులు నరోత్తంరెడ్డి, సుచరిత రెడ్డి, వడ్ల నందు, రాజేందర్ రెడ్డి, రాజు నాయక్, శ్రీధర్‌రెడ్డి, బుస్స శ్రీకాంత్, చరణ్‌రెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వికారాబాద్‌లో సంబరాలు చేసుకుంటున్న బీజేపీ నేతలు

క్లుప్తంగా

ఇద్దరు బైండోవర్



మోమిన్‌పేటలో బైండోవర్ చేసిన తహసీల్దార్ మనోహర్ చక్రవర్తి

మోమిన్‌పేట: గంజాయి పండిస్తున్న ఇద్దరిని బైండోవర్ చేసినట్లు తహసీల్దార్ మనోహర్ చక్రవర్తి తెలిపారు. శనివారం తహసీల్దార్ కార్యాలయంలో ఎక్సైజ్ కానిస్టేబుల్ శ్రీశైలం వారిని తహసీల్దార్ ఎదుట హాజరు పరిచారు. మండల పరిధిలోని టేకులపల్లి గ్రామానికి చెందిన పాప గౌడు, బూర్గుపల్లి గ్రామానికి చెందిన మానిక్‌రెడ్డిలు గతంలో గంజాయి సాగు చేశారు. దీంతో ఆ ఇద్దరిపై అప్పట్లో కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా వారిని తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. మళ్లీ ఎప్పుడు కూడా నిషేధిత సరుకులను పండించొద్దని తహసీల్దార్ సూచించారు.

గడ్డివాము దగ్ధం

రూ.50వేలు నష్టం



దగ్ధమవుతున్న గడ్డివాము

బొంరాస్‌పేట: మండల పరిధిలోని బురాన్‌పూర్‌లో శనివారం రాత్రి గడ్డివాము దగ్ధమైంది. వివరాలు ఇలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన మాజీ పీఏసీఎస్ చైర్మన్ కమ్మరి నారాయణ పశువుల కోసం నిల్వ చేసుకున్న పశుగ్రాసానికి ప్రమాదవశాత్తు నిప్పంటుకుని దగ్ధమైందని తెలిపాడు. రూ.50వేల వరకు నష్టమైందని వాపోయాడు. దగ్ధమవుతున్న పశుగ్రాసాన్ని ఆర్పేందుకు ప్రయత్నించినా ఫలితం దక్కలేదని తెలిపాడు.

అభినందన



సత్తయ్యగౌడ్‌ను అభినందిస్తున్న కేటీఆర్

అనంతగిరి: ఇటీవల కేరళలో జరిగిన 6వ జాతీయ మాస్టర్స్ అథ్లెటిక్స్‌లో వికారాబాద్ మండలానికి చెందిన బీఆర్ఎస్ మండల కార్యదర్శి సత్తయ్యగౌడ్ 5 కిలోమీటర్ల నడకలో రెండో స్థానంలో నిలిచారు. ఈ నేపథ్యంలో శనివారం బీఆర్ఎస్ భవన్‌లో నిర్వహించిన జిల్లా ముఖ్య నాయకుల సమావేశంలో ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్.. సత్తయ్యగౌడ్‌ను అభినందించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఆనంద్, పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి ఉన్నారు.



చోరీ జరిగిన వెంకటేశ్ ఇల్లు



గ్రీన్ సిటీ కాలనీలో రాజేశ్వరి ఇల్లు



వరుసగా చేసేస్తాం చోరీలు..
దమ్ముంటే పట్టుకోండి పోలీసులు!

తాండూరులో దొంగల బీభత్సం

- 48 గంటల వ్యవధిలో మూడిళ్లలో చోరీ
- 57 తులాల బంగారం, 20 తులాల వెండి, రూ.6.30 లక్షల నగదు అపహరణ
- క్లూస్ టీంతో ఆధారాలు సేకరించిన డీఎస్పీ, సీఐ

తాండూరు: రాత్రి, పగలు తేడా లేకుండా చోరీలకు పాల్పడుతున్న దొంగలు పోలీసులకు సవాలు విసురుతున్నారు. ఇళ్లల్లోకి చొరబడి బీభత్సం సృష్టిస్తున్నారు. 48 గంటల వ్యవధిలో వరుస చోరీలు చేసి 57 తులాల బంగారం, 20 తులాల వెండి, రూ.6 లక్షల నగదు అపహరించారు. తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని సాయిపూర్‌కు చెందిన సరళ, వెంకటేశ్ దంపతులు గురువారం ఇంటికి తాళం వేసి, కుటుంబ సభ్యులతో కలిసి బంధువుల వివాహానికి వెళ్లారు. శుక్రవారం ఇంట్లోకి చొరబడిన దుండగులు 40తులాల బంగారం ఎత్తుకెళ్లారు. శనివారం ఉదయం ఇంటికి చేరుకున్న బాధితులు తలుపులు ధ్వంసమైనట్లు గుర్తించి, లోపలికి వెళ్లి చూడగా బీరువాలోని బంగారం కనిపించలేదు. దీంతో పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. డీఎస్పీతో పాటు సీఐ సంతోష్ క్లూస్‌టీంతో వెళ్లి ఆధారాలు సేకరించారు.



దుండగులు ధ్వంసం చేసిన తలుపు గడియ

అంగన్‌వాడీ టీచర్ ఇల్లు లూటీ

సాయిపూర్ కేసును ఇన్వెస్టిగేషన్ చేస్తుండగానే గ్రీన్‌సిటీ ప్రాంతంలోని బోనమ్మ చెరువు వద్ద అంగన్‌వాడీ టీచర్ రాజేశ్వరి ఇంట్లో చోరీ జరిగింది. రోజూవారి విధుల్లో భాగంగానే ఉదయం 9గంటలకు రాజేశ్వరి వడ్డెరగల్లిలోని అంగన్‌వాడీ సెంటర్‌కు వెళ్లింది. ఉదయం 10 గంటల తర్వాత ఆమె భర్త బసయ్యగౌడ్ ఇంటికి తాళం వేసి బయటకు వెళ్లాడు. తాళాలు ధ్వంసం చేసి దొంగలు ఇంట్లోని 15 తులాల బంగారం, రూ.6 లక్షల నగదును ఎత్తుకెళ్లారు. మధ్యాహ్నం భోజనం చేసేందుకు ఇంటికి వచ్చిన రాజేశ్వరి చోరీ జరిగిన విషయాన్ని గుర్తించింది. వెంటనే బాధితులు పీఎస్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు.

గంటన్నరలో ఇల్లు గుల్ల

పట్టణంలోని పాతకుంటకు చెందిన అశోక్ తన భార్యతో కలిసి గురువారం మధ్యాహ్నం ఇంటికి తాళం వేసి ఆస్పత్రికి వెళ్లారు. గంటన్నర తర్వాత తిరిగివచ్చారు. ఈ కొద్దిపాటి సమయంలోనే తాళాలు పగులగొట్టిన దొంగలు ఇంట్లో దాచిన 2 తులాల బంగారం, 20 తులాల వెండి, రూ.30 వేల నగదు దోచుకెళ్లారు.

తాళం వేసిన ఇళ్లే టార్గెట్

పట్టణంలో తాళం వేసిన ఇళ్లే టార్గెట్‌గా చోరీలు చేస్తున్న దొంగలు ముందుగా రెక్కీ నిర్వహిస్తున్నట్లు పోలీసులు భావిస్తున్నారు. ఈ ఘటనలన్నీ ఒకే ముఠా చేసిందా..? వేర్వేరు ముఠాల పనా అనే దిశగా దర్యాప్తు చేస్తున్నారు. వీరిని పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలుస్తోంది. ఇది లోకల్ దొంగల పనేనా.. అంతర్రాష్ట్ర ముఠానా అనేది దర్యాప్తులో తేలనుంది.

గ్యాస్ లీకై నలుగురికి గాయాలు

గోరిగడ్డ తండాలో ప్రమాదం

- క్షతగాత్రులను మహబూబ్‌నగర్ ఆస్పత్రికి తరలింపు



గాయాలతో దేవమ్మ



గ్యాస్ లీకైన ఇంటి వద్ద జనం

కుల్కచర్ల: ప్రమాదవశాత్తు గ్యాస్ సిలిండర్ పైప్ లీకై మంటలు వ్యాపించి నలుగురికి గాయాలయ్యాయి. ఈ సంఘటన కుల్కచర్ల మండల పరిధిలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కుల్కచర్ల మండలం గోరిగడ్డ తండాకు చెందిన వడిత్య పాండు కుటుంబంతో ఉంటున్నాడు. రోజుమాదిరిగా భార్య దేవమ్మ ఇంట్లో వంట చేస్తుండగా ఒక్కసారిగా పైప్ నుంచి గ్యాస్ లీకై పెద్దఎత్తున మంటలు వ్యాపించాయి. అక్కడే ఉన్న పాండు, కుమార్తె సునీత, కుమారుడు గణేశ్‌లకు మంటలు అంటుకుని గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు 108కు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న అంబులెన్స్ సిబ్బంది వారిని మహబూబ్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనలో తమకు రూ.1.50 లక్షల నష్టం వాటిల్లిందని బాధితులు తెలిపారు.

తమ్ముడిని హత్య చేయించిన అన్న

తమ్ముడు ఆర్థికంగా ఎదుగుతుండడం.. తల్లిదండ్రులు సైతం అతనికే ప్రాధాన్యం ఇవ్వడం.. మరో వైపు తన భార్యతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడని కోపం పెంచుకున్న ఓ అన్న సోదరుడిని హత్య చేయించాడు. స్థానికంగా పనిచేస్తున్న యూపీ వాసులకు సుపారీ ఇచ్చి అంతమొందించాడు. చివరకు ఏమీ తెలియనట్లు మహారాష్ట్రకు పారిపోయాడు. హతుడి సోదరి ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేపట్టిన పోలీసులు సాంకేతిక ఆధారాలతో కేసును ఛేదించారు.



- రూ.50వేలకు సుపారీ.. రూ.5వేల అడ్వాన్స్
- మిస్సింగ్ కేసు దర్యాప్తులో బయటపడిన దారుణం
- నిందితుడికి రిమాండ్

శంకర్‌పల్లి: సొంత తమ్ముడి హత్యకు పథకం పన్నాడు ఓ అన్న. ఇందుకోసం రూ.50 వేల సుపారీ మాట్లాడుకున్నాడు. అనంతరం కేసు నుంచి తప్పించుకునేందుకు విఫలయత్నాలు చేసి చివరకు మోకిల పోలీసులకు చిక్కాడు. సీఐ వీరబాబు తెలిపిన ప్రకారం.. బిహార్ రాష్ట్రం నవాడా జిల్లా గొండపూర్ మండలం గోనావన్ గ్రామానికి చెందిన సురేంద్రశర్మ దంపతులకు సందీప్ కుమార్, దీపక్ కుమార్ ఇద్దరు కుమారులు. సందీప్‌కు వివాహం కాగా, దీపక్ అవివాహితుడు. వీరు ఐదేళ్ల క్రితం మోకిల గ్రామానికి వలస వచ్చారు. స్థానికంగా హెయిర్ కటింగ్ దుకాణం నిర్వహిస్తున్నారు. ఈ షాప్‌ను చిన్న కొడుకైన దీపక్‌కు అప్పగించిన తండ్రి సందీప్‌కు హోటల్ పెట్టించాడు. కటింగ్ దుకాణంలో ఎక్కువ ఆదాయం రావడం, తన భార్యతో అక్రమ సంబంధం పెట్టుకోవడం, తల్లిదండ్రులు తమ్ముడికే ప్రాధాన్యం ఇస్తున్నారనే కారణాలతో అతడి హత్యకు పథకం వేశాడు.

గొంతు కోసి.. బండరాళ్లతో మోది

తమ్ముడిని చంపాలని నిర్ణయించుకున్న సందీప్.. మోకిలలోని చికెన్ దుకాణంలో పని చేస్తున్న యూపీ వాసులు మిరాజ్‌అలం, సెక్యూరిటీగా పని చేస్తున్న గోవింద్‌సింగ్, ప్రదీప్‌తో రూ.50 వేలకు సుపారీ మాట్లాడుకున్నాడు. రూ.5వేల నగదు అడ్వాన్స్ ఇచ్చి.. మిగతాది హత్య తర్వాత ఇస్తానని ఒప్పందం చేసుకున్నాడు. నలుగురు కలిసి ప్లాన్ రూపొందించుకున్నారు. తన తమ్ముడికి అమ్మాయిల పిచ్చి ఉందని, వాడిని మరో మహిళతో ఏకాంతంగా గడిపేందుకు బయటకు తీసుకురావాలని అనుకున్నారు. ఈబాధ్యతను మిరాజ్‌కు అప్పగించగా, గతేడాది డిసెంబర్ 27న దీపక్‌ను శంకర్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలోని రామంతపూర్‌కు తీసుకువచ్చారు. అప్పటికే అక్కడ వేచి ఉన్న ప్రదీప్ వెంటనే దీపక్ గొంతు కోశాడు. అనంతరం మిరాజ్, ప్రదీప్ రాళ్లతో అతని తలపై బలంగా మోది హత్య చేశారు. అప్పటి వరకు వీళ్లను అనుసరించిన సందీప్, గోవింద్‌సింగ్.. దీపక్ చనిపోయాడా లేదా అని గమనించేందుకు వెళ్లి.. అతని ఫోన్ తీసుకుని స్విచ్ఛాఫ్ చేసి, సిమ్ పడేసి పారిపోయారు. తర్వాత ఏమీ తెలియనట్లు ఇంటికి వెళ్లిన సందీప్ తన భార్యతో కలిసి మహారాష్ట్రకు పారిపోయి, ఇటీవలే మోకిల వచ్చాడు.

సోదరి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు

తన సోదరుడు దీపక్‌కుమార్ అదృశ్యమైనట్లు గతేడాది డిసెంబర్ 27న సోదరి బిందు కుమారి మోకిల పోలీసులకు ఫిర్యాదు చేసింది. రంగంలోకి దిగిన పోలీసులు సాంకేతిక ఆధారాల సాయంతో శుక్రవారం సందీప్, మిరాజ్ అలం, గోవింద్‌సింగ్‌లను అదుపులోకి విచారించగా.. నేరం అంగీకరించారు. ప్రదీప్ పరారీలో ఉన్నాడు. పోలీసులు ముగ్గురిని తీసుకోని హత్య చేసిన స్థలానికి వెళ్లగా అక్కడ దీపక్ అస్థిపంజరం, అతని దుస్తులు లభించాయి. వాటిని డీఎన్ఏ పరీక్షలకు పంపనున్నారు. హత్య సమయంలో ఉపయోగించిన బైక్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను చేవెళ్ల కోర్టులో ప్రవేశపెట్టి, రిమాండ్ నిమిత్తం సంగారెడ్డి జిల్లా జైలుకి పంపినట్లు సీఐ తెలిపారు.

పురుగు మందు తాగి మేస్త్రీ బలవన్మరణం



యాదయ్య (ఫైల్)

దోమ: పురుగు మందు తాగి ఓ మేస్త్రీ బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన దోమ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. ఎస్ఐ ఆనంద్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని మల్లేపల్లికి చెందిన నెత్తి పెద్ద యాదయ్య(37) తనకున్న పొలంలో వ్యవసాయం చేసుకుంటూ.. మేస్త్రీ పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. కుటుంబలో చిన్న చిన్న తగాదాలతో పాటు సుమారు రూ.3లక్షల వరకు అప్పులు చేశాడు. దీంతో మనస్తాపానికి గురైన ఆయన శుక్రవారం అర్ధరాత్రి పొలానికి వెళ్లి పురుగుమందు తాగాడు. కుటుంబ సభ్యులు వెళ్లి చూడగా విగతజీవిగా పడిఉన్నాడు. వెంటనే ఆయన్ను పరిగి ప్రభుత్వాస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడికి భార్య జ్యోతి, నిఖిల్, అఖిల్, చింటూ ముగ్గురు పిల్లలు ఉన్నారు. తల్లి లక్ష్మమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అనారోగ్యంతో వ్యక్తి బలవన్మరణం

బంట్వారం: అనారోగ్య సమస్యతో బాధ పడుతున్న ఓ వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన కోట్‌పల్లి మండల పరిధిలోని మోత్కుపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్ఐ అబ్దుల్ గఫార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మోత్కుపల్లికి చెందిన బైండ్ల లక్ష్మయ్య (67) కొన్ని రోజులుగా అస్తమా వ్యాధితో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెంది శుక్రవారం సాయంత్రం పురుగుల మందు తాగాడు. ఈ విషయాన్ని గమనించిన కుటుంబ సభ్యులు వికారాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ పరిస్థితి విషమించడంతో వైద్యుల సూచన మేరకు ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు శనివారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

శివస్వాముల ఫోన్లు చోరీ

రెండు గంటల్లో రికవరీ చేసిన పోలీసులు

యాలాల: శివమాలధారణ చేసిన స్వాముల ఫోన్లు చోరీకి గురయ్యాయి. ఫిర్యాదు ఆధారంగా రెండు గంటల్లో బాధిత స్వాముల ఫోన్లను యాలాల పోలీసులు రికవరీ చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి..మండలంలోని ముకుందాపూర్ గ్రామంలో ఇటీవల పలువురు యువకులు శివమాలధారణ చేశారు. వీరందరూ గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయంలో బస చేస్తున్నారు. శుక్రవారం రాత్రి సమయంలో ఐదుగురు స్వాముల రూ.1.50 లక్షల విలువ గల ఫోన్లను గుర్తు తెలియని వ్యక్తి చోరీకి పాల్పడ్డాడు. ఈ విషయాన్ని మరుసటి రోజు ఉదయం బాధితులు యాలాల పోలీసులకు ఫిర్యాదు చేశారు. గ్రామానికి చేరుకున్న పోలీసులు అనుమానితుడిని అదుపులోకి తీసుకొని విచారించగా చోరీ విషయాన్ని ఒప్పుకున్నాడు. చోరీ సొత్తును పోలీసులకు అప్పగించాడు. దీంతో వారు బాధిత స్వాములకు గ్రామస్తుల సమక్షంలో ఫోన్లను అప్పగించారు. ఫిర్యాదు అందిన వెంటనే స్పందించిన ఎస్ఐ గిరి, హెడ్‌కానిస్టేబుల్ హన్మంతుకు మాజీ ఉప సర్పంచ్ రాజు గ్రామస్తుల తరపున కృతజ్ఞతలు తెలిపారు.

కలప లారీ పట్టివేత

పరిగి: అక్రమంగా తరలిస్తున్న కలప లారీని పట్టుకుని కేసు నమోదు చేసిన ఘటన పట్టణ కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్ఐ సంతోష్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం రాత్రి ఎస్ఐ కొడంగల్ చౌరస్తాలో విధులు నిర్వహిస్తుండగా కలప తరలిస్తున్న లారీని పట్టుకుని వివరాలు అడగ్గా ఎలాంటి వివరాలు చెప్పాలేదు. దీంతో లారీని పోలీస్ స్టేషన్‌కు తరలించి అటవీశాఖ అధికారులకు అప్పగించినట్టు తెలిపారు. అక్రమంగా ఇసుక, కలప తరలిస్తే సంబంధిత వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

బంట్వారం: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన శనివారం కోట్‌పల్లి మండల పరిధిలోని జిన్నారం సమీపంలో చోటు చేసుకుంది. ఎస్ఐ అబ్దుల్‌గఫార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జిన్నారం గ్రామానికి చెందిన పి బందయ్య(52) మధ్యాహ్న సమయంలో తన టీవీఎస్ వాహనంపై జిన్నారం చౌరస్తా నుంచి గ్రామంలోకి వెళ్తున్నారు. అదే సమయంలో వికారాబాద్ వైపు నుంచి కోట్‌పల్లి వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో బందయ్య బస్సు వెనుక చక్రం కింద పడి మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ గఫార్ తెలిపారు.

గునుగుల్ అటవీ ప్రాంతంలో మంటలు

యాచారం: నాగార్జునసాగర్- హైదరాబాద్ రహదారిపై గునుగల్ అటవీ ప్రాంతంలో శనివారం గుర్తు తెలియని వ్యక్తులు మంటలు అంటించారు. రోడ్డు పక్కన మంటలు ఎగిసిపడి అడవిలో నిప్పు రాజుకుంది. సమాచారం అందుకున్న యాచారం సీఐ నర్సింహారావు ఫైరింజన్లను తెప్పించి, గంటపాటు శ్రమించి మంటలను ఆర్పారు. గునుగల్ అటవీ ప్రాంతంలో పెద్ద సంఖ్యలో నెమళ్లు, జింకలు, ఇతర వన్య ప్రాణులు ఉన్నాయి. అటవీ ప్రాంతం కాలిపోతే వీటికి తీవ్ర నష్టం కలుగుతుందని స్థానికులు పేర్కొంటున్నారు.

కదులుతున్న బస్సు నుంచి పడిపోయిన మహిళ



గాయపడిన మహిళ

కొత్తూరు: కదులుతున్న ఆర్టీసీ బస్సు నుంచి పడిపోయిన మహిళ గాయపడింది. ఈ సంఘటన కొత్తూరు పట్టణంలో శనివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన ప్రకారం.. మహబూబ్‌నగర్ పట్టణానికి చెందిన ఓ కుటుంబం కొత్తూరులో నివాసం ఉంటున్న బంధువుల వద్దకు వచ్చారు. కాగా వారు పని నిమిత్తం కొత్తూరు నుంచి హైదరాబాద్‌కు వెళ్లేందుకు కుటుంబ సభ్యులతో కలిసి బస్టాండ్‌కు వచ్చారు. షాద్‌నగర్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సును ఎక్కిన వెంటనే ఎక్స్‌ప్రెస్ అని చెప్పడంతో బస్‌దిగారు. ఈ క్రమంలో చివరగా దిగుతున్న చంద్రకళ(50) కింద పడిపోయింది. గమనించని డ్రైవర్ ముందుకు వెళ్లడంతో బస్ వెనుక చక్రాలు ఆమె పాదం మీదుగా వెళ్లడంతో తీవ్రంగా గాయపడింది. కుటుంబ సభ్యులు ఆమెను చికిత్స నిమిత్తం శంషాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు.

24, 25న జిల్లా మహాసభలు



జిల్లా మహాసభల వాల్ పత్రికను ఆవిష్కరిస్తున్న నాయకులు

షాద్‌నగర్‌రూరల్: కేంద్ర బడ్జెట్‌లో విద్యారంగానికి జరిగిన అన్యాయాన్ని నిరసిస్తూ నిర్వహించనున్న ఎస్ఎఫ్ఐ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని ఆ సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి నాగరాజు పిలుపునిచ్చారు. ఈ నెల 24, 25న నిర్వహించనున్న జిల్లా మహాసభల వాల్‌పోస్టర్‌ను శనివారం పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ.. కేంద్రం ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో విద్యారంగానికి అరకొర నిధులను కేటాయించిందని ఆరోపించారు. ప్రభుత్వ విద్యారంగాన్ని ప్రైవేట్‌పరం చేసేందుకు కుట్రలు పన్నుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర బడ్జెట్‌లో విద్యారంగానికి కోతలు పెట్టడాన్ని నిరసిస్తూ ఈ నెల 10న హైదరాబాద్ ఇందిరాపార్కువద్ద మహాధర్నా, విద్యారంగ సమస్యలను పరిష్కరించడంతో పాటుగా ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేసేందుకు కావాల్సిన నిధులను కేటాయించాలని కోరుతూ 24, 25న జిల్లా మహాసభలను నిర్వహిస్తామన్నారు. ఈ మహాసభలకు ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు ప్రణయ్, చరణ్, శ్రీకాంత్, శ్రీకాంత్, స్టాలిన్, అరుణ్, వేణు తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు చైన్‌స్నాచర్లకు రిమాండ్



వివరాలు వెల్లడిస్తున్న పట్టణ సీఐ విజయ్‌కుమార్

- బంగారు పుస్తెలతాడు, రెండు సెల్‌ఫోన్లు, ఓ బైక్ స్వాధీనం
- వివరాలు వెల్లడించిన సీఐ విజయ్‌కుమార్

షాద్‌నగర్ రూరల్: ఒంటరిగా ప్రయాణిస్తున్న మహిళలను టార్గెట్ చేసుకుని చైన్ స్నాచింగ్‌కు పాల్పడుతున్న ఇద్దరు బైక్ ర్యాపిడో కెప్టెన్లను పోలీసులు రిమాండ్‌కు తరలించారు. ఇందుకు సంబధించిన కేసు వివరాలను శనివారం పట్టణ సీఐ విజయ్‌కుమార్ విలేకరుల సమావేశంలో వెల్లడించారు. కర్నూలు జిల్లా, జూపడ్‌బంగ్లా మండలం, తంగడంచ గ్రామానికి చెందిన సంజపోగు జాషువా, కర్నూల్ జిల్లా నందికొట్కూరు మండలం మండ్లెం గ్రామానికి చెందిన బెస్త పవన్‌కల్యాణ్ హైదరాబాద్‌లో ర్యాపిడో కెప్టెన్‌లుగా పని చేస్తున్నారు. జాషువా నగరంలోని యూసుఫ్‌గూడ, పవన్‌కల్యాణ్ తెల్లాపూర్‌లో నివాసం ఉంటున్నారు. వీరికి బైక్ రైడ్‌లతో వచ్చే డబ్బు సరిపోకపోవడంతో అక్రమంగా డబ్బు సంపాదించాలని నిర్ణయించుకున్నారు. ఒంటరిగా వెళ్లే మహిళలను టార్గెట్ చేసుకుని వారి ఒంటిపై బంగారు ఆభరణాలు దోచుకుని పరారవుతున్నారు.

ద్విచక్రవాహనంపై వచ్చి

మహబూబ్‌నగర్‌కు చెందిన విజయలక్ష్మి జనవరి 5న ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని మొగిలిగిద్దలో తల్లిగారింటికి వెళ్లేందుకు షాద్‌నగర్ బస్టాండ్‌లో బస్సు దిగింది. ఒంటరిగా వెళ్తున్న ఆమెను గమనించిన జాషువా, పవన్‌కల్యాణ్ అనుసరిస్తూ వెళ్లారు. విజయలక్ష్మి ఎక్కిన ఆటోలో జాషువా ఎక్కి వెనకాల కూర్చున్నాడు. పవన్‌కల్యాణ్ బైక్‌పై ఆటోను అనుసరించాడు. మొగిలిగిద్ద సమీపంలోకి వెళ్లగానే జాషువా ఆటో ఆపాలని డ్రైవర్‌ను కోరడంతో ఆటో పక్కకు నిలిపాడు. దీంతో వెనకాల కూర్చున్న సంజపోగుజాషువా విజయలక్ష్మి మెడలోనుండి రెండున్నర తులాల బంగారు పుస్తెతాడును తెంచుకొని పవన్‌కల్యాణ్ బైక్ ఎక్కి పరారయ్యారు.

నిందితులకు రిమాండ్

చైన్‌స్నాచింగ్ కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. శంషాబాద్ ఎస్ఓటీ, స్థానిక పోలీసులు సాంకేతిక ఆధారాలతో నిందితులను గుర్తించి జాషువా, పవన్‌కల్యాణ్‌ను విచారించగా నేరం ఒప్పుకొన్నారు. దీంతో వారిని రిమాండ్‌కు తరలించి.. వారి వద్ద నుంచి రెండున్నర తులాల బంగారు పుస్తెలతాడు, రెండు సెల్‌ఫోన్లు, ఓ బైక్ స్వాధీనం చేసుకున్నారు. శంషాబాద్ డీసీపీ రాజేష్, అడిషనల్ డీసీపీ రాంకుమార్, సైబరాబాద్ క్రైం డీసీపీ నరసింహ, ఏసీపీ శశాంకరెడ్డి, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ పవన్, సీసీఎస్ ఎస్ఐ అవినాష్, ఏసీపీ రంగస్వామి పర్యవేక్షణలో విచారణ అధికారి పట్టణ సీఐ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో డీఐ వెంకటేశ్వర్లు, డీఎస్ఐ శరత్‌కుమార్, సిబ్బంది మోహన్, కరుణాకర్, జాకీర్, రాజు, రఫీ కేసును ఛేదించారు.

పెస్ట్ కంట్రోల్ స్ప్రేయర్ ముసుగులో చోరీ

మీర్‌పేట: చైన్‌స్నాచర్‌ను అరెస్టు చేసిన మీర్‌పేట పోలీసులు శనివారం రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ నాగరాజు కథనం ప్రకారం. బడంగ్‌పేట శ్రీనిలయం కాలనీకి చెందిన జల్లి ప్రేమ్‌కుమార్ (28) పెస్ట్ కంట్రోల్ స్ప్రే పని చేస్తుంటాడు. టీఎస్ఆర్‌నగర్‌లో వస్త్ర దుకాణం నిర్వహిస్తున్న ఉడుతల యాదమ్మ ఈనెల 3న షాపులో ఉండగా ప్రేమ్‌కుమార్ ఆమె ముఖానికి ఏదో పూసినట్లు చేసి మెడలోని బంగారు గొలుసును తెంచుకెళ్లే ప్రయత్నం చేశాడు. ఆమె ప్రతిఘటించడంతో సగం చైన్ లాక్కుని పారిపోయాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు ప్రేమ్‌కుమార్‌ను అదుపులోకి తీసుకుని 20 తులాల బంగారం, ఒక ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకుని నిందితుడిని రిమాండ్‌కు తరలించారు.